# చిక్కుడుగింజ పుట్టుక

రచన: "ఎల్లోరా"

అనగా అనగా ఒక అవ్వ వుంటుండేది. ఆ అవ్వ చాలా బీదది. ఒక రోజున ఏమయిందంటే అన్నం వండుకోడానికి బియ్యం కూడా యింట్లో లేవు. సరే ఏం చేస్తాంలే! అనుకుంది అవ్వ. వెతికితే యింట్లో చిక్కుడుగింజలు దొరికాయి. ఆ గింజలని ఉడకబెట్టుకు తిందాంలే అనుకుంది. మరి గింజలని వుడకబెట్టుకోడానికి నిప్పు కావాలి కదా? అందుకని పొయ్యిలో నిప్పు వేసింది. ఆ నిప్పు ఎంతకీ మండకపోయేటప్పటికి కొంచం గడ్డిపరకలని పొయ్యిలో వేసింది.

పొయ్యిమీద పెట్టిన కుండలో చిక్కుడుగింజలు పోసింది! అలా పోస్తూ వుండగా ఒక చిక్కుడుగింజ కుండలో పడకుండా జారి క్రింద వున్న గడ్డిపరకదగ్గర పడింది. మరికొంతసేపటికి పొయిలోని బొగ్గు ఒకటి ఎగిరి సరిగా చిక్కుడుగింజ, గడ్డిపోచ పడివున్న చోటనే పడింది!

"ఏమర్రా! ఎక్కడినుంచి వచ్చారు మీరు"- అని చిక్కుడుగింజని, బొగ్గుని పలకరించింది గడ్డిపరక!

"ఏదో! అదృష్టం ఉండబట్టి కాని, నిప్పులోంచి బయటపడ్డాను, కొంచం ఆలశ్యం అయివుంటే యీపాటికి మసి అయిపోయి వుందును"—అంది బొగ్గు!

"సరేనా!......ఏదో సర్రా! భూమిమీద రాళ్లు ఉండబట్టికాని లేకపోతే నేనూ నావాళ్లలాగ యీపాటికి ఆకుండలో ఉడికి పోదును"-అంది గింజ!

"నేనుమాత్రం ఏమిటి? నాకూ చావుతప్పి కన్ను లొట్టపోయినంత పనయింది! పాపం మావాళ్లందరూ బూడిద అయిపోయారు. అదృష్టం వుండి అవ్వ వేళ్లసందుల్లోంచి జారాను కనుక కాని, లేకపోతేనా...?''-అంది గడ్డిపరక!

"సరే! అన్నీ బాగానే వున్నాయి! ఒకరిని గురించి ఒకరం తెలుసుకున్నాం—బాగుంది! యింక ముందుగతి ఏమిటర్రా''—అని అడిగింది బొగ్గు!

"మీరు నిర్ణయించినదానిని నేను కాదంటానా అన్నట్లు ఏం మాట్లాడకుండా కూర్చుంది గడ్డిపోచ!

"అయితే! అడిగారు కనుక చెబుతున్నా. నా సలహా ఏమిటంటారా! మనందరం అన్యోన్యంగా, కలసికట్టుగా ఉండి యింకో పరాయి చోటుకుపోయి వుందాం, అలా చేస్తే మనకు మంచిదికూడాను అంది''- గింజ!

మంచి సలహా చెప్పినందుకు బొగ్గు, గడ్డిపోచ గింజమిత్రుడ్ని చాలా మెచ్చుకున్నాయి. గింజ చెప్పిన సలహా ప్రకారం మిత్రత్రయం బయలుదేరారు! అలా నడుస్తూ, అక్కడక్కడ విశ్రాంతి తీసుకుంటూ ప్రయాణం సాగిస్తున్నారు—వెళ్లగా వెళ్లగా ఒక ఏరు అడ్డువచ్చింది. ఏరు దాటడం ఎలాగ? ఏ పక్క చూసినా ఎక్కడా వంతెన కనుపించలేదు. ఏం చేయడమా అని ఆలోచించగా ఒక చక్కని ఉపాయం తట్టింది! గడ్డిపోచకి. "తల ఒకగట్టుమీద, కాళ్లు ఒక గట్టుమీద పెట్టి వెల్లకిలా పడుకుని మిగిలిన మిత్రులకి వంతెనలాగ ఉపయోగించడం''— ఆ ప్రకారంగా గడ్డిపోచ వెల్లకిలా పరుంది. అలా పడుకోవడం తరువాయిగా బొగ్గు తొందర పట్టలేక హడావిడిగా తూలుతూ గడ్డిపోచమీద నడక సాగించింది! సరిగా మధ్యకి వచ్చేటప్పటికి బొగ్గుకి కళ్లుతిరిగాయి అందుకని కళ్లుమూసుకుంది- కళ్లుమూసుకుని యెల్లా నడుస్తుంది? అందుకని లేచి నిలబడింది.

ఇక్కడ ఒక విచిత్రం జరిగింది! పొయ్యిలోంచి కదా బొగ్గు ఎగిరి బయట పడింది! అలా బయటపడినప్పుడు బొగ్గు కాళ్లుమాత్రం నిప్పుతోనే వున్నాయి—ఆరిపోలేదు— ఆ విషయం హడావిడిలో బొగ్గు గుర్తించుకోలేదు!

కళ్లు తిరగడంమూలాన గడ్డిపోచమీద బొగ్గు నిలబడింది కదా. అల్లా నిలబడ్డచోట నిప్పు వుండడం మూలంగా గడ్డిపోచ అంటుకు

పోయి రెండుముక్కలుగా ఏటిలో కొట్టుకుపోయింది. పంతెనలా వున్న గడ్డిపోచ అంటుకుపోయి కొట్టుకుపోవడంతో బొగ్గుకు ఆధారం లేక ఏటిలోపడి ప్రాణాలు విడిచింది!

ఇక మిగిలింది చిక్కుడుగింజే కదూ! అది యింకా గట్టుమీదే వుంది. గడ్డిపోచ, బొగ్గు ఆవిధంగా అవటంచూసి గింజ ఫక్కున నవ్వింది. మరీ వింతగా నవ్వడంతో గింజకు పొట్ట బ్రద్దలయింది. ఆసమయంలో గింజకూడా చచ్చిపోయి వుండేదే! కాని అదృష్టంకొద్దీ అప్రక్కనే కూర్చున్న దర్జీ దాన్ని చూశాడు. ఆ దర్జీ చాలా మంచివాడు కనుక, తత్ క్షణం తన దగ్గర వున్న సూదీ, దారంతీసి దానిపొట్ట కుట్టేశాడు. దర్జీ చేసిన సహాయానికి గింజ చాలా సంతోషించింది!

గింజ పొట్టని కుట్టేటప్పుడు దర్జీ తనవద్దవున్న నల్లని దారాన్ని వుపయోగించాడు! అందుచేత ఆరోజు నుంచీ ప్రతి చిక్కుడుకీ దాని పొట్ట మీద నల్లనిచార వుంటుంది!

“చిక్కుడుగింజకు నల్లటిచార ఎలా వచ్చిందో చూశారా పాపాయిలూ! ఇదీ చిక్కుడు గింజ పుట్టుక!

★




ఎప్పుడూ
క్షణమైనా చింతలేదు

కేరింతలు, దృఢమైన అవయవాలు. ఆరోగ్యకరమైన శరీరం. అతనికి సమపాళ్లగల పుష్టికరమైన ఆహారం కలదనడానికి తార్కాణం. ఇవి లాక్టోజన్ వల్ల చేకూరినవే అతనికి సహజమైన ఆహారం, తల్లి పాలవలెనే వుండి, అంత తేలికగాను ఇది అరగడమే కారణం.




విశ్వసించండి

LACTOGEN లాక్టోజన్

తల్లిపాలు ఇవ్వలేనపుడు

ఉచిత లాక్టోజన్ ఫోల్డర్‌కు ఈ కూపన్ పూర్తిచేసి పంపండి. నెస్సిల్స్ (ప్రాడక్ట్స్) (ఇండియా) లి. పోస్టు బాక్సు 396, కలకత్తా

7

పేరు ..................

చిరునామా ..................

..................

LG/G/7